## అడల్ట్స్ ఓన్లీ!

A

# ప్రేమపాఠాలు

కె.వి. లక్ష్మి

శ్రావణమాసం వస్తోందంటే రాంబాబు గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. భయమూ..కంగారు కలిగి చిరుచెమట్లు పడుతున్నాయి. శరీరం చిన్నగా కంపిస్తోంది.

తన సమస్యని ఎవరికైనా చెప్పి సలహా అడగాలన్నా....సిగ్గు ముంచుకొస్తోంది. పైగా ఆ బ్రాంచికి ట్రాన్స్‌ఫరై కొత్తగా వచ్చాడేమో, పర్సనల్ విషయాలు మాట్లాడుకొనేంత క్లోజ్ ఫ్రెండ్స్ లేరు.

ఏం చేయాలో తోచక తికమకపడుతూ..అయోమయావస్థలో వున్న రాంబాబుకి ఫ్లాష్‌లా వెలిగింది. 'ఆ' ఐడియా రాగానే మేరు పర్వతంలా కన్పిస్తున్న తన ప్రాబ్లమ్ ఇంత ఈజీగా సాల్వ్ అవుతుందనుకోగానే తల భారం తగ్గి తేలిగ్గా నిట్టూర్చాడు.

''ఏమిటోయ్!...రాంబాబు కొత్తగా పెళ్ళయిన పడుచువాడివి...పాదరసంలా వుండాల్సింది పోయి..డల్‌గా తయారయ్యావేంటి? పదిసార్లు పిలిచినా పలకలేదు. ఏవిటో ఈమధ్య పరధ్యానంగా వుంటున్నావు?'' సీనియర్ గుమస్తా గుర్నాథం కళ్ళజోడు పైనించి గుచ్చి గుచ్చి చూస్తూ అడిగాడు.

ఉలిక్కిపడ్డాడు రాంబాబు. అమ్మో! ఆవులిస్తే పేగులు లెక్కబెట్టే లాగున్నాడే! నా పొజిషన్ పసిగట్టలేదు కదా! ఆ ఊహ రాగానే ఇమ్మీడియెట్‌గా మొహంలో ఎక్స్‌ప్రెషన్స్ మార్చుకొని..

''ఉదయం నుండి తల నొప్పిగా వుంది సార్'' అన్నాడు. లేని తల నొప్పికి కణతలు నొక్కుకుంటూ.

''తలనొప్పా..నేనింకా 'ఆమె' గుర్తొచ్చిందేమోనని అదేనోయ్ కొత్తగా పెళ్ళయినవాడివి కదా! నీ భార్య గుర్తొచ్చి పరధ్యానంలో పడ్డావేమోననుకున్నా'' ఫైల్ మూసి ఫెళ్ళున నవ్వేడు.

అంతలా నవ్వాల్సిన జోకేంటో అర్థం కాక తనూ ఫైల్ మూసి సీట్‌లోంచి లేచాడు రాంబాబు.


రోడ్డుకిరువైపులా వున్న బోర్డులు జాగ్రత్తగా చూసుకుంటూ నడుస్తున్నాడు రాంబాబు.

తనని వేధిస్తున్న రకరకాల డౌట్స్‌ని గుర్తుచేసుకొని అసలు కొత్తగా పెళ్ళయిన మగాళ్ళంతా ఇంతేనా లేక తనకే ఇలాంటి అనుమానాలొస్తున్నాయా అని ఆలోచించుకుంటూ నడుస్తున్నాడు.

కాళ్ళకి సడన్ బ్రేక్ పడినట్టుగా ఆగాడు

ఎదురుగా తాటికాయలంత అక్షరాలతో పెద్ద బోర్డు..డా. సుఖేష్, సెక్స్ స్పెషలిస్ట్..పేరు ప్రక్కన ఓ అరడజను డిగ్రీలున్నాయి..

అర్థం తెలీక పోయినా ఆ డిగ్రీలన్నీ ఓసారి చదివేడు.



ఆ తరువాత...ఆ ఆసుపత్రి తాలూకు మెట్లెక్కాడు. ఈ క్షణాన తన్నెవరైనా చూస్తే? అనుకోగానే గుండె గుబ గుబలాడింది. ఓసారి దృష్టిసారించి అటూ..ఇటూ ఆందోళనగా చూసాడు. అంతే...

రాంబాబుకి ముచ్చెమటలు పట్టుకొచ్చాయి. గుండె ఒకసారిగా జారి కడుపులోకొచ్చినట్టయ్యింది. తన పరువంతా నడివీధి పాలయ్యినట్టు ఫీలయ్యాడు.

రోడ్డుకి అవతలివేపువున్న చిన్న హోటల్ ముందు నిలబడి విలాసంగా టీ త్రాగుతూ కన్పించాడు మదన్ గోపాల్ మరో ఫ్రెండుతో కలిసి.

పెద్ద ఆపదలో చిక్కుకోబోయి అదృష్టం కొద్ది తృటిలో తప్పించుకొన్నట్టు రిలీఫ్‌గా నిట్టూర్చాడు.

ఇంకా నయం తనని చూడలేదు..చూస్తే తప్పక పళ్ళికిలిస్తూ పలకరించేవాడే..అయినా చూస్తే ఏమనుకుంటాడు? ఏదో వెధవ పని చేసి..రోగాన్ని వదిలించుకోటానికి వచ్చాడు అనుకోడు.

తన గురించి ఆఫీసంతా చాలా చీప్‌గా ప్రచారం చెయ్యడూ! నాన్నకీ సంగతి తెలిస్తే ఏవన్నా వుందా? అసలే దుర్వా

సుడు.. మన ఇంటావంటా లేని వెధవ బుద్ధులు ఎక్కడ్నించి వచ్చాయిరా శుంఠ అంటూ వీరంగమాడడూ!

అటు అత్తగారింటి వాళ్ళకి తెలిస్తే తన పరువేం కానూ? తననో పుమనై జరుగా ట్రీట్ చేయరూ?

అమ్మో... పెద్ద గండం నుండి బయటపడ్డాను, అనుకుంటూ మెట్లు దిగటానికి ఉద్యుక్తుడయ్యాడు.

''సార్! మరీ అంత తొందరైతే ఎలా? డాక్టర్‌గారు పేషంట్లతో బిజీగా వున్నారు. ఒక్క ఐదు నిముషాలు వెయిట్ చెయ్యండి.. లోపలికి పంపుతాను. ప్లీజ్.. ఆ కుర్చీలో కూచోండి.''

కాంపౌండర్ కాబోలు చాలా ప్లీజింగ్‌గా మాట్లాడాడు.

అతని మాట తీరుకి ముగ్ధుడైనా.. మదన్ గుర్తుకి రాగానే కంగారు కలిగింది.

''అబ్బే వెళ్ళడం లేదోయ్! ఎదురుగా వున్న హోటల్లో ఫ్రెండ్ కన్పిస్తే వెళుతున్నా... ఇప్పుడే వచ్చేస్తా.. జస్ట్ ఫైవ్ మినిట్స్..'' మదన్ తన్ని గమనించలేదని పక్క సందులోకి బాణంలా దూసుకుపోయాడు.

మరుసటిరోజు లంచవర్లో రాంబాబుని ఒంటరిగా దొరకబుచ్చుకొని 'ఎనీ ప్రాబ్లెమ్' అంటూ నిలదీశాడు మదన్.

హతాశుడయ్యాడు రాంబాబు.

''అదీ.. అదీ..'' నసిగాడు.

''ఆ నసుగుడేంటి? స్ట్రైట్‌గా మేటర్లోకొచ్చేయ్!''

కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాడు రాంబాబు. తర్వాత తన సమస్య నెమ్మదిగా చెప్పాడు.

ఆ మాట వినటంతోనే భళ్ళున నవ్వేడు మదన్. ''ఇంత చిన్న విషయానికి అంతలా వర్రీ అవుతావేంటోయ్ రాంబాబు..''

సిగరెట్ వెలిగించుకొని ''నే సాల్వ్ చేస్తాగా.. ఇటువంటి విషయాల్లో.. సలహాలు... సంప్రదింపులు.. థియరీలు.. ఎందుకూ పనికిరావు.''

''అయితే ఏం చేయాలంటావ్?'' అమాయకంగా అడిగాడు.

''ప్రాక్టికల్స్'' పొగ రింగులు రింగులుగా వదులుతూ చెప్పాడు.

''అంటే?'' అయోమయంగా అడిగాడు.

రాంబాబు వేపు పురిటి కందును చూసినట్టు చూశాడు.

''ఏం లేదోయ్! ఒక రంగుల రామచిలుకతో ప్రాక్టికల్స్ మొదలెట్టాలి.. ఎక్స్‌పీరియన్స్ తెచ్చుకోవాలి దట్సాల్.''

అతని ఎడ్వయిజ్‌కో, సరిపడని సిగరెట్ పొగకోగాని దగ్గొచ్చి ఉక్కిరిబిక్కిరయ్యాడు రాంబాబు.

అతని రెస్పాన్స్ కోసం సిగరెట్ కాలుస్తూ ఎదురుచూస్తున్నాడు మదన్.

''అంటే.. అంటే వేశ్యలా'' కొన్ని క్షణాల తర్వాత చాలా బలహీనంగా పలికింది రాంబాబు గొంతు.

''ఛ ఛ వేశ్యలు... వారకాంతలు అంటూ ఏవిటోయ్ ఆ భాష. ఇప్పుడంతా క్లాస్... కాల్‌గాల్స్ అని చాలా క్లాస్‌గా పిలుస్తారు.''

''పేరు ఏదైతేనేం అక్కడికెళ్ళటం నాకిష్టం లేదు'' చిన్నగా అన్నాడు.

''అయ్యో! వెళ్ళకపోతే ఎలా?'' ప్రళయం వచ్చేస్తుందన్నంత ఆందోళనగా అడిగాడు.

''ఎలాగోలా ఎడ్జస్టవుతాలే''

''ఎడ్జస్టేవిటోయ్!.. ఫస్ట్ నైటంటే ఆషామాషీ అనుకున్నావా? ఆ.. గదిలో తెల్లమొహం వేస్తే.. మీ ఆవిడ నిన్నెలా చూస్తుందో తెలుసా?''

ఆ సీనంతా సెవెంటీ ఎమ్ ఎమ్‌లో వూహించేసుకొని వణికిపోయాడు రాంబాబు.

రాంబాబునే అబ్జర్వ్ చేస్తున్న మదన్. ''రాత్రి ఎనిమిది తర్వాత సెంటర్‌కొచ్చేయ్'' అని మరో మాటకి అవకాశం ఇవ్వకుండా తన సీట్ దగ్గరికి వెళ్ళిపోయాడు.

★★★

రాంబాబు బెరుగ్గా.. భయం.. భయంగా గదిలోకెళ్ళాడు.

చిన్న గది. గోడల నిండా అర్ధనగ్న క్యాలెండర్లు. పట్టెమంచం మీద పాతదే అయినా శుభ్రంగా వున్న దుప్పటి పరిచి వుంది. ఇంతలో ఇరవై ఆరు ఇరవై ఏడేళ్ళ అమ్మాయి గదిలో కొచ్చి తలుపులు గెడేసింది.

''కూర్చోండి'' అని అతన్ని పరిశీలనగా చూస్తూ 'అందగాడే' అనుకుంది.

నిశ్శబ్దంగా మంచం మీద ఆనీ ఆననట్టు కూర్చున్నాడు.

అతని ప్రక్కనే అనుకున్నట్టుగా కూర్చుని అడిగింది ''మీ పేరు.''

వెంటనే ఆమెకి దూరంగా జరిగాడు.

అతని చర్యకి ఆమె నవ్వుకుంది.

''రాంబాబు'' కప్పుకేసి చూస్తూ చెప్పాడు.

అతనేంటో ఆమెకి పూర్తిగా అర్థమైంది. గదిలోకి రాగానే చాలామంది మగవాళ్ళు మీదపడి వేటాడే క్రూరమృగాల్లా ప్రవర్తిస్తారు. అందుకు భిన్నంగా వున్న రాంబాబుని చూస్తుంటే ఆశ్చర్యంగా వుంది.

అతని వత్తయిన క్రాఫ్‌ని చూస్తూ అడిగింది. ''అలా మూడీగా వున్నారేం.. ఇక్కడికి రావటం మీకిష్టం లేదా?.. స్నేహితుల బలవంతం మీద వచ్చారా?''

''అనుభవం కోసం.. స్నేహితుల సలహా మీద వచ్చాను.''

# స్థూలకాయుల పోటీ



ఇంగ్లాండులో ఈమధ్య మహాస్థూలకాయుల పోటీ జరిగింది. గున్నఏను గుల్లా వున్న ఎందరెందరో, తమ కండలను ప్రదర్శించారు. వారిలో కొందరు అందగాళ్లు కూడా ఉన్నారు. లావుపాటి వాళ్లలో, అందం ఉండదనే అపవాదును వారు తొలగించారు.

మార్టిన్ రిచర్డ్స్ అనే ఓ మహాలావుపాటి ఆయన ఆ పోటీల్లో ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాడు. అతగాడి బరువు 30 స్టోన్స్. (420 ఎల్‌బిలు!) ద్వితీయ బహుమతిని ఇయాన్ మార్టిన్ అందుకొన్నాడు. ఇతని బరువు 24 స్టోన్స్. (336 ఎల్‌బీలు)

మార్క్‌నార్త్ ఓవర్ అనే 'బొండాం' ఆసామికి తృతీయ పురస్కారం లభించింది! అతను అందగాడు. నటుడు కూడా. ''అందమైన అమ్మాయిలు ఎందరో నాకోసం ఉవ్విళ్ళూరుతారు! వాళ్లు నాకు టెడ్డీ బేర్ అనే ముద్దుపేరు కూడా పెట్టారు'' అంటాడు మార్క్‌నార్త్.



ఆ పోటీలను తిలకించడానికి పురుష పుంగవులతోపాటు, స్త్రీలు కూడా ఎందరో వచ్చారు. వారిలో సౌందర్యరాశులు సహితం ఉన్నారు. నడిచే పర్వతాల్లా వున్న వాళ్లను చూసి, పురుషులలోకన్నా స్త్రీలలో కుతూహలం ఎక్కువగా కలిగింది. కొందరు అమ్మాయిలు అయితే, పెద్ద పెద్ద బెలూన్లలా వున్నవాళ్లను చూసి పరవశించిపోయారు. వారిలో సంతోషం పరవళ్లు తొక్కింది.

కొందరు తమ కోరికలు అణచుకోలేక, ఏకంగా స్టేజీమీదకు దూసుకు వెళ్లి, పిప్పళ్ల బస్తాల్లా ఉన్న వాళ్లను బిగియారా కౌగలించుకొని ముద్దుల్లో ముంచెత్తారు. వారు కురిపించిన అభిమానవర్షంలో, పోటీల్లో పాల్గొన్న అందరూ తడిసి ఉక్కిరిబిక్కిరయ్యారు.

ఈ పోటీల్లో కొందరు మరుగుజ్జు స్థూలకాయులు సహితం పాల్గొన్నారు. వీరి రోజువారి కార్యక్రమం ఏమంటే- తినడం, తాగడం! అందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా వారి శరీరాలు మన కళ్ల ముందు ఉన్నాయి కదా!

**-కొడిమెల శ్రీరామమూర్తి**

ఆమెకి ఈ అనుభవం కొత్తగా...గమ్మత్తుగా వుంది. ''పెళ్ళి చేసుకోబోతున్నారా?''

''పెళ్ళయింది..శ్రావణమాసంలో....అదీ'' పొడిగా చెప్పాడు.

ఆమె మెల్లగా నవ్వింది. కొన్ని క్షణాల తర్వాత అడిగింది.

''నేనో మాటడుగుతాను ఏమీ అనుకోరుగా?''

''...''

''మీ భార్య పెళ్ళివరకూ పవిత్రంగా వుండి ఫస్ట్‌నైట్‌లో తన పవిత్రమైన కన్యాత్వాన్ని మీకర్పించాలనుకుంటున్నారు కదూ!''

''...''

''అలాగనే తన భర్త కూడా పవిత్రంగా వుండాలనుకోవటం తప్పుకాదనుకుంటాను.''

చివ్వున తలెత్తి ఆమె కళ్ళల్లోకి చూశాడు రాంబాబు.

''చెప్పండి! నా అభిప్రాయం సరైనది కాదంటారా?'' ఆమె కళ్ళు సూటిగా ప్రశ్నిస్తున్నాయి.

''కాదని ఎలా అనగలను. ఇన్నాళ్ళు మొదటిరాత్రి తన మగతనాన్ని ప్రదర్శించటానికి ఆరాటపడ్డానే కానీ....ఆడ, మగ ఇద్దరికీ శీలం ముఖ్యమైనదేనని మరోకోణం నుండి ఎందుకు ఆలోచించలేకపోయాను. ఎంత అనాలోచితంగా మదన్ నిర్ణయానికి తలవంచాను. ఇక్కడికి వచ్చి చాలా పొరబాటు చేశాను.'' రాంబాబులో ఆత్మపరిశీలన తలఎత్తింది.

''ఏమిటీ..మౌనం దాల్చారు? డబ్బు పడేస్తే సుఖం అందించే ఒక నీతిమాలిన ఆడది నీతిబోధ చేస్తోందని కోపం వస్తోందా?''


''నో..నో..మీ మాటలు తాత్కాలికంగా మరుగునపడిన నా సంస్కారాన్ని తట్టి లేపాయి. ఇలా రావటం నా పొరబాటు.'' గిల్టీగా చెప్పాడు.

''రావటం మీ పొరబాటైనా..ఇక్కడ పొరబాటు పనేమీ జరగలేదుగా'' నవ్వింది.

ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు. మట్టిలో మాణిక్యంలా ఆమెలోని సంస్కారం మిలమిల మెరుస్తోంది. గంజాయి వనంలో తులసి మొక్కలా..పవిత్రతకి ప్రతీకలా తోచింది.

''చూడండి రాంబాబుగారూ! మొదటి రాత్రి అనేది రెండు హృదయాల సంగమం. సిగ్గుని..భయాన్ని ప్రక్కకి నెట్టి..ఏకాంతంలో మనసులు విప్పి మాట్లాడుకోటానికి దోహదపడుతుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో స్పర్శ ద్వారా ఇరుహృదయాలు స్పందించినపుడు శరీరం కలయిక కోసం తహతహలాడుతుంది. అది ప్రకృతి సహజం. పశుపక్ష్యాదులకెవరు నేర్పుతున్నారు? ఆ అనుభవం మీకెలా కొత్తో ఆమెకీ అంతేకదా! మీ ఫ్రెండ్ లాంటి వాళ్ళు, నకిలీ డాక్టర్లు, మీలాంటివారిని పెడదారి పట్టిస్తుంటారు. లేనిపోని అనుమానాలు..భయాలు పుట్టిస్తుంటారు. దాన్ని క్యాష్ చేసుకుంటారు. అపోహలన్నీ మీ మనస్సు నుండి తుడిచివేసి పవిత్రమైన మనశ్శరీరాలతో వైవాహిక జీవితంలోకి మీ భాగస్వామిని మనస్ఫూర్తిగా ఆహ్వానించండి...తొలి కలయికలోని మాధుర్యాన్ని..ఆనందాన్ని మీ భార్య నుండి పొందండి. ఆ అనుభవాన్ని మీ మనసు డైరీలో స్వీట్ నథింగ్స్‌గా నోట్ చేసుకోండి. ఆ మధుర జ్ఞాపకాల పరిమళం మీ జీవితాంతం గుబాళిస్తూ సంసారాన్ని స్వర్గమయం చేస్తుంది.''

ఆమెకెలా కృతజ్ఞతలు తెలియజేయాలో తెలియనట్టుగా ఆమెకేసి చూస్తూండిపోయాడు రాంబాబు.




★★★

అడుగుపెడుతూనే గదంతా కలయజూసి వండరైపోయాడు రాంబాబు.

డబుల్ కాట్ మీద ఆర్టిస్టిగ్గా అమర్చిన మల్లెలు, గులాబీ రేకులు. గదంతా కమ్మిన అగరొత్తుల ధూపం. టీపాయ్ మీద స్వీట్స్..పళ్ళు..పాలగ్లాసు.

గోడకున్న తైలవర్ణచిత్రంలో..ఆలింగనంలోని హాయిని ఆనందంగా అనుభవిస్తున్న ప్రణయమూర్తులు రాధాకృష్ణులు.

ఆ ప్రణయజంట మోములో ప్రస్ఫుటమవుతున్న పారవశ్యాన్ని తదేకంగా చూస్తున్న రాంబాబు తలుపు చప్పుడవటంతో వులిక్కిపడి తల తిప్పి చూశాడు. ఎంత వద్దనుకున్నా అలజడికి లోనవుతున్న గుండెని నొక్కిపెట్టాడు.

వైదేహి లోపలికొచ్చింది. తలుపు గొళ్ళెం పెట్టిన చప్పుడైంది.

అపర రతీదేవిలా మెరిసిపోతున్న ఆమె సౌందర్యాన్ని కొద్దిసేపు కన్నార్పకుండా చూసి..

''వైదేహీ! ఇలారా'' అన్నాడు. అతనిగొంతు అతనికే కీచుగా విన్పించింది.

ఆమె తడబడుతూ నడుస్తుంటే అందెలు చిరుసవ్వళ్ళు చేస్తుంటే..చెవిలోలకులు అలవోకగా కదులుతున్నాయి. ఆమె తత్తరపాటు చూస్తుంటే ఆరోజు రాత్రి ఆమె చెప్పిన.. ఛ కనీసం పేరు కూడా అడిగి తెలుసుకోలేకపోయాను. 'నీకే కాదు..ఆమెకి ఆ అనుభవం కొత్తే కదా' అన్న మాటలు గుర్తొచ్చాయి రాంబాబుకి.

''కూర్చో.''

ఆమె మౌనంగా కూర్చుంది. అతనికి కొంచెం దూరంగా.

ఆ తర్వాత ఏం మాట్లాడాలో..ఎలా పలకరించాలో అర్థం కాలేదు. డైలాగులు మర్చిపోయిన కారెక్టర్‌లా దిక్కులు చూస్తూ కూర్చున్నాడు.

ఇంతలో..అతనూహించని విధంగా కెవ్వున అరిచి అతన్ని గట్టిగా కౌగలించుకుంది వైదేహి.

ఆమె ఎందుకలా అరిచిందో అంతుపట్టలేదు. తీరా చూస్తే అతని చేతులు ఆమెని చుట్టి వున్నాయి. అతనికి ఆమె స్పర్శ అదోలాంటి అనుభూతిని కలిగించింది.

అయినా ఆ పొజిషన్ అతనికి ఇబ్బంది కలిగించి వదిలించుకోబోతే...ఆమె తన పట్టుని మరింతగా బిగిస్తూ..

''బ..బ..బ..ల్లి'' అంది చిన్న పిల్లలా భయపడుతూ.

అప్పుడు చూశాడు మంచం చివర పాకిపోతున్న బల్లిని. ఆమె నాజూకు శరీర స్పర్శ అతనిలో గిలిగింతల్ని కలిగిస్తూ..ఏవో కోరికల్ని కలిగిస్తోంది.

ఆమెనలాగే పొదివి పట్టుకొని అధరాల మీద సున్నితంగా ముద్దుపెట్టుకున్నాడు రాంబాబు.

వారిరువురూ ప్రేమపాఠాల్ని నేర్చుకుంటుంటే...అంతవరకు దొంగచాటుగా తొంగి..తొంగి చూస్తున్న చందమామ కొంటెగా నవ్వి...ఇహ చూడటం సభ్యత కాదని మబ్బుచాటున దాక్కున్నాడు.

విండో పక్క నుండి నిక్కి..నిక్కి చూస్తున్న నైట్‌క్వీన్ గుంభనంగా నవ్వుకొని పరిమళాలని వారికి కానుకగా పంపింది. ★